# తాలిపేరు 15 గేట్లు ఎత్తివేత

**తాలిపేరు నుంచి 10,738 క్యూసెక్కుల విడుదల**



**చర్ల, జూలై 21:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని తాలిపేరు మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టులో నీటిమట్టం పెరగడంతో మంగళవారం సాయంత్రం 4 గంటలకు అధికారులు జలాశయ ద్వారాలను (స్పిల్‌వే గేట్లు) 15, ఒక్కోటి ఒక అడుగు మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టుకు 9,679 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా, 10,738 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు గరిష్ఠ

మిగతా 2 లో...

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం | 22 | జులై | 2026 • పేజీలు : 5



# ఆంధ్ర చదువు తెలంగాణలో కొలువు

5 లో..

- వైద్యో నారాయణ...! • ప్రభుత్వానికే మస్కా..! • ఫేక్ సర్టిఫికెట్లతో ప్రభుత్వ వైద్య ఉద్యోగం సాధించాడా..?
- 1 నుంచి 10వ తరగతి వరకు నకిలీ విద్యా ధృవపత్రాలు సృష్టించి ఉద్యోగం పొందినట్లు ఆరోపణలు
- లోకల్ నిబంధనలను అడ్డంగా పెట్టుకుని ప్రభుత్వాన్ని మోసం చేశారనే విమర్శలు
- ప్రభుత్వ వైద్యుడిగా విధులు నిర్వహిస్తూనే ప్రైవేట్ ఆసుపత్రి నిర్వహణపై ఆరోపణలు
- నకిలీ ధృవపత్రాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు..?
- టీవీవీపీలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన ఫేక్ సర్టిఫికెట్ల వ్యవహారం
- జిల్లా అధికారులు సమగ్ర విచారణ చేపడితే బహిర్గతం కానున్న నిజాలు

**సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగం సాదించాలంటే ఎంతో కష్టంతో కూడుకున్న పని. అంతేకాకుండా ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎంతో శ్రమ, పట్టుదల ఉంటే సాధ్యమవుతుంది. ఇదే కోవలో క్రింద స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాడంటే కూడా కష్టమే. కానీ ఇల్లందులోని తెలంగాణ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ (టివిపిపి) లో వైద్యుడిగా పనిచేస్తున్న ఓ వైద్యుడు ప్రభుత్వాన్ని బురిడీ కొట్టించి దర్జాగా ప్రభుత్వ వైద్యశాలలో ఓ ఉన్నతమైన హోదాలో కొనసాగుతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది.**

• భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

# ఆయిల్‌పామ్‌తో రైతులకు ఆర్థిక భరోసా




**సాగు విస్తరణ జరిగితే పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తాం**

**రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**ఆయిల్‌పామ్ సాగులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానం**

**జిల్లా కలెక్టర్ అంకిత్**

**ములకలపల్లి జులై 21 (ప్రజాజ్యోతి):** ఆయిల్‌పామ్ సాగు రైతుల ఆర్థిక స్థిరత్వానికి బలమైన పునాదిగా నిలుస్తుందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ములకలపల్లి మండలంలో మరో 10 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు విస్తరిస్తే పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు వెంటనే శంకుస్థాపన చేస్తామని ప్రకటించారు. మంగళవారం ములకలపల్లిలో నిర్వహించిన ఆయిల్‌పామ్ రైతుల ఆత్మీయ సమ్మేళనంలో జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి మంత్రి పాల్గొని మాట్లాడారు. గిరిజన కుటుంబాల ఆదాయం పెరిగితేనే వారి పిల్లల భవిష్యత్తు మరింత ఉజ్వలంగా మారుతుందని అన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రహదారులు, తాగునీరు, విద్యుత్, వైద్యం, విద్య వంటి మౌలిక

మిగతా 2 లో...

# ఫ్లెక్సీల చిచ్చు.....



**మంత్రి పర్యటనలో బహిర్గతమైన వర్గ విభేదాలు**

**ములకలపల్లి, జూలై 21 (ప్రజా జ్యోతి):** మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన స్వాగత ఫ్లెక్సీల వ్యవహారం ములకలపల్లి మండలంలో రాజకీయ వేడిని పెంచింది. ఫ్లెక్సీల ధ్వంసంపై ఇరువర్గాల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు చోటుచేసుకోవడంతో పార్టీలోని వర్గ విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. రైతు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం ములకలపల్లి మండల కేంద్రానికి రానున్న నేపథ్యంలో, ఆయన అభిమానులు, నాయకులు సోమవారం రాజుపేట–జగన్నాథపురం ప్రధాన రహదారికి ఇరువైపులా భారీగా స్వాగత ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా మంగళవారం ఉదయం కొన్ని ఫ్లెక్సీలు దెబ్బతిన్న స్థితిలో కనిపించడంతో వివాదం మొదలైంది. పొంగులేటి వర్గానికి చెందిన నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని, ఇందులో ప్రత్యర్థి వర్గీయుల ప్రమేయం ఉందని ఆరోపించారు. మరోవైపు తుమ్మల వర్గానికి చెందిన ఫ్లెక్సీలు కూడా దెబ్బతిన్నాయని ఆ వర్గ నాయకులు తెలిపారు. ఘటనాస్థలికి చేరుకున్న

మిగతా 2 లో...

# ఢిల్లీలో విద్యార్థుల ఉద్యమం..

## జిల్లాలోనూ తీవ్ర చర్చ

**సామాజిక మాధ్యమాల్లో వెల్లువెత్తిన స్పందనలు**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జులై 21, ప్రజా జ్యోతి :** దేశ రాజధానిలోని ఢిల్లీలో సిజెపి (కాక్రోచ్ జనతా పార్టీ) నేతృత్వంలో నిర్వహించిన విద్యార్థుల ఉద్యమం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న విద్యార్థుల నిరసనలు, జూలై 20న జరిగిన "సంసత్ చలో" కార్యక్రమంలో చోటుచేసుకున్న ఉద్రిక్త పరిణామాల తర్వాత భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ ఈ అంశంపై సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. దేశంలోని నీట్ తోపాటు

మిగతా 2 లో...

## ఢిల్లీలో విద్యార్థుల ఉద్యమం..

(మొదటి పేజీ తరువాయి...)

పలు ప్రవేశ పరీక్షల నిర్వహణ, ప్రశ్నాపత్రాల లీక్ ఆరోపణలు, విద్యా వ్యవస్థలో పారదర్శకత, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు కొద్ది రోజులుగా జంతర్ మంతర్ వద్ద నిరసనలు కొనసాగిస్తున్నాయి. ఈ ఉద్యమానికి దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థులు, యువత, సామాజిక కార్యకర్తలు సంఘీభావం తెలిపారు. ఈ క్రమంలో జూలై 20న పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు విద్యార్థులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు దేశవ్యాప్తంగా వైరల్ కావడంతో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. నిరసనకారులు బలప్రయోగం జరిగిందని ఆరోపిస్తుండగా, అనుమతి లేకుండా ర్యాలీ చేపట్టడంతో శాంతిభద్రతల పరిరక్షణ కోసమే చర్యలు తీసుకున్నామని ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఈ పరిణామాల ప్రభావం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ కనిపించింది. వాట్సాప్ గ్రూపులు, ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాల్లో వేలాది పోస్టులు, వీడియోలు, అభిప్రాయాలు షేర్ అవుతున్నాయి. ప్రజాస్వామ్యంలో విద్యార్థులు తమ సమస్యలను ప్రశాంతంగా చెప్పుకునే హక్కు ఉందని, వారి గొంతు వినాలని పలువురు పోస్టులు చేయగా, చట్టాన్ని అమలు చేయడం కూడా ప్రభుత్వ బాధ్యతేనని మరికొందరు అభిప్రాయపడ్డారు. జిల్లాలోని పలువురు విద్యార్థులు, యువజన సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు కూడా ఈ అంశంపై స్పందించారు. అభిప్రాయ భేదాలు ఉన్నా ప్రజాస్వామ్యంలో సంభాషణే పరిష్కార మార్గమని, విద్యార్థుల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలని వారు సూచిస్తున్నారు. ఢిల్లీలో ప్రారంభమైన ఈ ఉద్యమం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చకు దారితీయగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ సామాజిక మాధ్యమాల వేదికగా అదే చర్చ కొనసాగుతోంది.

## ఫ్లెక్సీల చిచ్చు....

(మొదటి పేజీ తరువాయి...)

తుమ్మల వర్గ నాయకులు దెబ్బతిన్న ఫ్లెక్సీలను తొలగించి వాటి స్థానంలో కొత్త ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకున్నారు. అయితే పొంగులేటి వర్గీయులు మాత్రం తమ స్వాగత ఏర్పాట్లను కావాలనే ధ్వంసం చేశారని విమర్శించారు. ఈ ఘటనకు బాధ్యులు ఎవరన్నది స్పష్టతకు రాకపోయినా, ఇరువర్గాల మధ్య ఉన్న విభేదాలు మరోసారి చర్చకు వచ్చాయి. రైతుల సంక్షేమం కోసం నిర్వహించిన కార్యక్రమాన్ని ఫ్లెక్సీల వివాదాలు, వర్గ రాజకీయాల వైపు మళ్లించడం సరికాదని పలువురు రైతులు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, మంత్రి పర్యటనలో స్థానిక ఎమ్మెల్యే, పార్టీ మండల అధ్యక్షుడు, పొంగులేటి వర్గానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు దూరంగా ఉండటం కూడా రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఫ్లెక్సీల వివాదం నేపథ్యంలో పార్టీలోని అంతర్గత పరిణామాలు మరోసారి తెరపైకి వచ్చాయని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

## తాలిపేరు 15 గేట్లు ఎత్తివేత

(మొదటి పేజీ తరువాయి...)

నీటిమట్టం 74.00 మీటర్లు కాగా, ప్రస్తుతం నీటిమట్టం 73.65 మీటర్లకు చేరుకుంది. ప్రాజెక్టు అడుగుభాగం ఎత్తు (క్రెస్ట్ లెవల్) 69.00 మీటర్లుగా ఉంది. ప్రాజెక్టు మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 730.000 మిలియన్ ఘనపు అడుగులు (ఎంసీఎఫ్‌టీ) కాగా, ప్రస్తుతం 663 ఎంసీఎఫ్‌టీ నీరు నిల్వ ఉంది. ఇందులో వినియోగానికి అందుబాటులో ఉన్న నీటి నిల్వ (లైవ్ స్టోరేజ్) 443 ఎంసీఎఫ్‌టీగా అధికారులు తెలిపారు. పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన మేరకు నీటి విడుదల కొనసాగిస్తున్నట్లు అన్నారు .

# ఆయిల్‌పామ్‌తో రైతులకు ఆర్థిక భరోసా









(మొదటి పేజీ తరువాయి...)

సదుపాయాలతో పాటు గురుకులాలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల ద్వారా గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

**వరి సాగుకు దూరంగా ఉండాలి**

సూపర్ ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో ఇప్పటికే 35 శాతం వర్షపాతం లోటు నమోదైందని మంత్రి తెలిపారు. రానున్న నెలల్లోనూ సాధారణం కంటే తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున బోర్లపై ఆధారపడి వరి సాగు చేయవద్దని రైతులకు సూచించారు. పెసర, మినుము, కంది, అలసంద వంటి అపరాల సాగును విస్తరించాలని సూచించారు. పత్తిలో కందిని అంతర పంటగా సాగు చేస్తే అదనపు ఆదాయం రావడంతో పాటు భూసారం కూడా పెరుగుతుందని తెలిపారు.

**మరో 10 వేల ఎకరాలు సాగు చేస్తే ఫ్యాక్టరీ**

ములకలపల్లి మండలంలో ప్రస్తుతం 8 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరుగుతోందని మంత్రి తెలిపారు. మరో 10 వేల ఎకరాల్లో సాగు విస్తరిస్తే పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయిల్‌పామ్‌తో పాటు మునగ, పప్పు ధాన్యాలను అంతర పంటలుగా సాగు చేయడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. పోడు భూముల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి సౌర విద్యుత్ సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి రైతు ఉపాధి హామీ పథకం ద్వారా తన పొలంలో ఫామ్ పాండ్ నిర్మించుకుని వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలని మంత్రి సూచించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు గోదావరి జలాలు అందించడం తన జీవిత లక్ష్యమని స్పష్టం చేశారు. డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణానికి రైతులు సహకరిస్తే ప్రతి రైతు పొలానికి గోదావరి జలాలు అందిస్తామని తెలిపారు.

**ఆయిల్‌పామ్‌లో జిల్లా అగ్రస్థానం: కలెక్టర్ అంకిత్**

జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 90 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరుగుతోందని, ఈ ఏడాది మరో 15 వేల ఎకరాల్లో సాగు విస్తరణ లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని శాఖల సమన్వయంతో కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామని చెప్పారు. ఆత్మనిర్భర్ మిషన్ అపరాల కార్యక్రమంలో భాగంగా కంది, మినుము విత్తనాలను 50 శాతం రాయితీపై రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కోర్స చంద్రకళ, ఆర్డీఓ మధు, ఎంఆర్ఓ స్వాతి బిందు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి బాబూరావు, ఏడీ రవికుమార్, ఏవో అరుణ్ కుమార్, విద్యుత్తు శాఖ ఏడి అమిన్ హుస్సేన్, ఏ ఈ నరేష్, ఎంపిడిఓ సత్యనారాయణ, ఆయిల్ ఫామ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆల్లపాటి ప్రసాద్, దమ్మపేట మాజీ జెడ్పిటిసి పైడి వెంకటేశ్వరరావు, పామర్తి వేంటేశ్వరరావు, అడపా నాగేశ్వరరావు, పర్వతనేని ఆమర్నాథ్, , నాగాళ్ళ వెంకటేశ్వరరావు, బాల అప్పారావు, కరుటూరి కృష్ణ, చిలకపాటి జయ చందర్ రావు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఆయిల్‌పామ్ సంస్థ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ నమోదు విజయవంతానికి కాంగ్రెస్ కార్యకర్తలు బీఎల్ఓలకు సహకరించాలి

**మండల అధ్యక్షులు వాసం శ్రీకాంత్**



**ఆళ్లపల్లి, జూలై 21 (ప్రజాజ్యోతి)** ఎస్ఐఆర్ ఓటరు నమోదు కార్యక్రమాన్ని నూటికీ నూరు శాతం విజయవంతం చేసేందుకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బీఎల్ఓలకు అందుబాటులో ఉండి సహకరించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వాసం శ్రీకాంత్ పిలుపునిచ్చారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ఉర్దూ పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. అనంతరం నూతన మండల అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన వాసం శ్రీకాంత్ను రామంజిగూడెం సర్పంచ్ మోకాళ్ల చంద్రశేఖర్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు వాసం సుస్మిత, వెంకటేశ్వర్లు, చిన్న పాపయ్య, ఉపసర్పంచ్ వగలబోయిన సతీష్, మాజీ ఎంపీపీ పడిగ సమ్మయ్య, సీనియర్ నాయకుడు మహమ్మద్ అతహర్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి నులకతాటి శ్రీను, మండల అధ్యక్షుడు ఇనుముల ఇందు కుమార్, నాయకులు కాంతు, చందు, భరత్, సాయి, ప్రశాంత్, సత్తార్, చీమల శేఖర్, రవి, రాము, నాగం, నాగేష్, వీరభద్రం, మహిళా నాయకులు గలిగే సమ్మక్క, పానుగంటి మంగ, పర్వీన్, జోగ బాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మామిడి తాండ్ర ఫ్యాక్టరీ వద్ద ప్రత్యేక SIR ఓటరు నమోదు



**అశ్వారావుపేట (ప్రజాజ్యోతి), జులై 21:** అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని 164 నుంచి 168 పోలింగ్ బూత్‌ల వ్యాప్తిలో ఇప్పటివరకు ఓటరు నమోదు పూర్తి చేసుకోని అర్హులైన పౌరుల కోసం మామిడి తాండ్ర ఫ్యాక్టరీ వద్ద సోమవారం ప్రత్యేక SIR ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు ముఖ్య అతిథిగా హాజరుకాగా, తహశీల్దార్ డి. కిషోర్ ప్రత్యేక పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది.

**అక్కడికక్కడే ఓటరు నమోదు సౌకర్యం**

ఈ సందర్భంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ స్పాట్‌లోనే (అక్కడికక్కడే) ఓటరుగా నమోదయ్యే అవకాశాన్ని అధికారులు కల్పించారు. అనంతరం వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు మరియు తహశీల్దార్ డి. కిషోర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనది. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలి. బూత్ నంబర్లు 164 నుండి 168 పరిధిలోని అర్హులైన ప్రజలందరూ ఈ ప్రత్యేక అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి." అని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎన్నికల అధికారులు, బిఎల్ఓలు (BLOs) మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొని నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేశారు.

# రైతులకు వరి సాగు శిక్షణ

- **నేరుగా విత్తే వరి సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం**



**చర్ల, జూలై 21 :(ప్రజాజ్యోతి):** మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించే నేరుగా విత్తే వరి సాగు (డైరెక్ట్ సీడెడ్ రైస్ – డీఎస్ఆర్) విధానంపై రైతులకు అవగాహన కల్పించేందుకు భారతీయ వరి పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్–ఐఐఆర్ఆర్), హైదరాబాద్ ఎస్‌బీఐ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. చర్ల మండలంలోని లెనిన్‌నగర్, ఉంజుపల్లి, దోసిల్లపల్లి, దేవరపల్లి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమాలకు రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా భారతీయ వరి పరిశోధనా సంస్థ రీసెర్చ్ అసోసియేట్ డా. ఎస్. కవి రాజు మాట్లాడుతూ నేరుగా విత్తే వరి సాగు పద్ధతి వల్ల నీటి వినియోగం సాగు ఖర్చులు గణనీయంగా తగ్గడంతో పాటు పంట దిగుబడులు స్థిరంగా పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. విత్తన శుద్ధి, కలుపు నివారణ, నీటి యాజమాన్యం, పంట నిర్వహణలో పాటించాల్సిన శాస్త్రీయ పద్ధతులను రైతులకు వివరించారు. రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు తలెత్తే అవకాశం ఉన్నందున నీటిని పొదుపుగా వినియోగిస్తూ అరుతడి నీటి పారుదల పద్ధతులను అనుసరించాలని సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారి ఆఫ్రిద్ మహమ్మద్ మాట్లాడుతూ వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకొని రైతులు ఆధునిక సాగు విధానాలను అవలంబించడం ద్వారా ఉత్పాదకతను పెంచుకోవచ్చన్నారు. ముఖ్యంగా డీఎస్ఆర్ పద్ధతిని విస్తృతంగా స్వీకరించాలని రైతులకు సూచించారు.మైరాడ స్వచ్ఛంద సంస్థ కమ్యూనిటీ ఆర్గనైజర్ నవీన్ మాట్లాడుతూ డీఎస్ఆర్ పద్ధతిని అనుసరిస్తున్న రైతులకు తమ సంస్థ ద్వారా అందిస్తున్న ప్రోత్సాహకాలు సాంకేతిక సహకారం గురించి వివరించారు. కార్యక్రమ నిర్వహణలో ప్రాజెక్ట్ యంగ్ ప్రొఫెషనల్ శ్రీకాంత్ సహకారం అందించారు.శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు నేరుగా విత్తే వరి సాగుకు సంబంధించిన పలు సందేహాలను నిపుణులను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ పద్ధతి ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించి సాగు వ్యయాన్ని నియంత్రించడంతో పాటు మెరుగైన దిగుబడులు సాధించవచ్చని తెలుసుకుని తమ పొలాల్లో అమలు చేసేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు.

## 11 కేవీ విద్యుత్ షాక్‌తో వ్యక్తికి తీవ్ర గాయాలు

- **విద్యుత్ స్తంభంపై పనులు చేస్తుండగా ప్రమాదం.. ఆస్పత్రికి తరలింపు**





**టేకులపల్లి,జూలై 21,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం ఈర్యారాంపురం గ్రామంలో సోమవారం జరిగిన విద్యుత్ ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు.గ్రామానికి చెందిన అంగోత్ రవి (35) పక్కింటికి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సమస్యను సరిచేయాలనే ఉద్దేశంతో స్థానిక ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆఫ్ చేసిన అనంతరం విద్యుత్ స్తంభంపైకి ఎక్కాడు.అయితే, ఈ క్రమంలో 11కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్‌కు ప్రమాదవశాత్తు తగలడంతో ఆయనకు తీవ్ర విద్యుత్ షాక్ తగిలింది. షాక్ ప్రభావంతో స్తంభంపై నుంచి కిందపడిన రవికి తీవ్ర గాయాలయ్యా యి. ప్రమాదాన్ని గమనించిన గ్రామస్తులు వెంటనే అతడిని కిందకు దించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రికి తరలించారు.ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటన గ్రామంలో కలకలం రేపింది. ప్రమాదానికి గల పూర్తికారణాలు, ఘటనకుసంబంధించిన ఇతర వివరాలు తెలియాల్సి ఉంది.

## కాంకేర్ లో నక్సల్స్ డంప్ స్వాధీనం

- **మందుగుండు సామగ్రి, పేలుడు పదార్థాలు స్వాధీనం**





**చర్ల , జూలై 21 (ప్రజా జ్యోతి ):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ లో బస్తర్ రేంజ్ ఇన్ స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బద్రి నారాయణ్ మీనా, భానుప్రతాపూర్ బీఎస్ ఎఫ్ డీఐజీ దీపక్ తివారీ, కాంకేర్ జిల్లా ఎస్పీ నిఖిల్ రాఖేచా, కోయిలిబేడ 40వ బెటాలియన్ బీఎస్ ఎఫ్ కమాండెంట్ రణధీర్ సింగ్ గిల్ ఆదేశాల మేరకు జిల్లాలో నక్సల్ వ్యతిరేక ఆపరేషన్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.ఈ నేపథ్యంలో డీఆర్ జీ, బీఎస్ ఎఫ్, బాంబు నిర్వీర్య దళం (బీడీఎస్) సంయుక్తంగా నిర్వహించిన గాలింపు చర్యల్లో కోయిలిబేడ పోలీస్ స్టేషన్–నారాయణ్ పూర్ సరిహద్దులోని అల్పరాస్–గుమ్ చూర్ అటవీ ప్రాంతంలో నక్సల్స్ ఏర్పాటు చేసిన డంప్ ను గుర్తించి భారీగా మందుగుండు సామగ్రి, పేలుడు పదార్థాలు, నక్సల్ వినియోగ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న సామగ్రిలో 42 ఇన్సాస్ రౌండ్లు, 48 త్రీ నాట్ త్రీ (303) రైఫిల్ రౌండ్లు, 23 ఎస్ ఎల్ ఆర్ రౌండ్లు, 34 ఎనిమిది ఎంఎం రౌండ్లు, 8 .315 బ్లాంక్ రౌండ్లు, 8 బీజీఎల్ సెల్స్, 10 డిటోనేటర్లు, 10 మీటర్ల కార్డెక్స్ వైర్, 4 మీటర్ల క్యామోఫ్లాజ్ క్లాత్, సుమారు 5 కిలోల పేలుడు పదార్థాలు, మందులు, స్టీల్ బాక్స్ లు తదితర నక్సల్ సామగ్రి ఉన్నాయి.భద్రతా దృష్ట్యా బాంబు నిర్వీర్య దళం బీజీఎల్ సెల్స్, డిటోనేటర్లు, కార్డెక్స్ వైర్ ను అక్కడికక్కడే సురక్షితంగా నిర్వీర్యం చేసి ధ్వంసం చేసింది.ఈ ఆపరేషన్ లో బీఎస్ ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ అంకుష్ కుమార్, సబ్ ఇన్ స్పెక్టర్లు మహేంద్ర సింగ్, రజత్ జెఫ్, రోషన్ లాల్ మీనాతో పాటు డీఆర్ జీ బృందం పాల్గొంది. నక్సల్ డంప్ ను గుర్తించి స్వాధీనం చేసుకోవడంలో డీఆర్ జీ టీమ్ కమాండర్, అసిస్టెంట్ సబ్ ఇన్ స్పెక్టర్ చంద్రశేఖర్ ఠాకూర్ కీలక పాత్ర పోషించినట్లు అధికారులు తెలిపారు.

## బండారు రామకృష్ణకు అవకాశం ఇవ్వండి

- **డీసీసీ అధ్యక్షురాలు దేవి ప్రసన్నకు కాంగ్రెస్ నాయకుల వినతి**

**చర్ల, జూలై 21 (ప్రజాజ్యోతి):** చర్ల మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ పదవికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బండారు రామకృష్ణను నియమించాలని కోరుతూ మండల కాంగ్రెస్ నాయకులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు దేవి ప్రసన్నకు మంగళవారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బండారు రామకృష్ణ గత మూడు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తూ గ్రామస్థాయి నుంచి పార్టీని పటిష్టం చేయడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి ఎన్నో ఇబ్బందులు ఎదురైనా పార్టీని వీడకుండా కార్యకర్తలకు అండగా నిలిచారని ఆయన సేవలను గుర్తించి పీఏసీఎస్ చైర్మన్ పదవిని అప్పగించాలని కోరారు.అలాగే గతంలో చర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడి నియామకంలో సీనియర్ నాయకులు జిల్లా కమిటీలోని నేతల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారని తమ అసంతృప్తిని డీసీసీ అధ్యక్షురాలి దృష్టికి తీసుకెళ్లారు. భవిష్యత్తులో పార్టీ నియామకాల విషయంలో కార్యకర్తలు,సీనియర్ నాయకుల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.వినతిని స్వీకరించిన డీసీసీ అధ్యక్షురాలు దేవి ప్రసన్న మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన వారికి తగిన గుర్తింపు అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ విషయాన్ని రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేరిన వారికి కాకుండా పార్టీ కోసం దీర్ఘకాలంగా సేవలందించిన నాయకులు, కార్యకర్తలకే నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఉంటుందని అన్నారు . మెజారిటీ నాయకుల అభిప్రాయాలకు అనుగుణంగానే పార్టీ నిర్ణయాలు ఉంటాయని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు చింతిర్యాల రవికుమార్, చర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పరుచూరి రవికుమార్, నూగూరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరప శ్రీనివాసరావు, ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల బుచ్చిబాబు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బండారు రామకృష్ణ, జవ్వాది రవికుమార్, ఆత్మ కమిటీ డైరెక్టర్ అలవాల మహేష్ నాయుడు, రత్నాజీ, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆవుల విజయభాస్కర్ రెడ్డి, యువ నాయకులు చీమకుర్తి సాయిచరణ్, జితేంద్ర నాయుడు, సుందరి సురేష్, పటేల్ వెంకటేశ్వర్లు, మేడిచర్ల కుమార్, చల్లకోటి వాసుదేవరావు, గూడపాటి రామకృష్ణ, తోటమల్ల వరప్రసాద్, కాకర్ల కుమార్, సర్పంచులు మంగమ్మ, అశోక్ కుమార్, వాసు, మాజీ ఎంపీటీసీ కాక ధర్మయ్య, కణితి నాగేశ్వరరావు, కణితి శ్రీను, చల్ల పవన్, మేడబట్టిని మనోహర్, పూజారి రమణయ్య, మునిగేల సాగర్, తడికల నరసింహారావు, ఎడెల్లి తిరుపతిరావు, శ్రీకాంత్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

- **సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ**



**టేకులపల్లి, జూలై 21,ప్రజాజ్యోతి:** నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ టేకులపల్లిలో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. జంతర్‌మంతర్ వద్ద శాంతియుతంగా ఆందోళన చేస్తున్న సీజేపీ కార్యకర్తలపై పోలీసుల లాఠీచార్జీని ఖండించారు. కార్యక్రమంలో ఎట్టి నరసింహారావు, డి. ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం దమనకాండను ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏలిని నో దృశ్య ప్రత్యామ్నాయ పంటలు మెరుగు. ఏడిఏ తాతారావు



**గుండాల జులై 21 ప్రజాజ్యోతి** ఏలిని నో ప్రభావం వల్ల ప్రత్యామ్నాయ పంటలను ప్రజలు ఎంచుకోవాలని ఏడిఏ తాతారావు అన్నారు. మంగళవారం మండలంలోని శెట్టిపల్లి గ్రామపంచాయతీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎలిని నో పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రైతులు పత్తి వారి పంటలకు బదులుగా'కంది . పెసర. వేరుశనగ. కూరగాయలకు సంబంధించిన పంటలను ఎంచుకోవాలన్నారు. తద్వారా రైతులకు పంట మార్పిడితోపాటు మెరుగైన దిగుబడి సాధించుకుంటారని పేర్కొన్నారు. ఎలిని నో వాళ్ళ ప్రజలు అప్రమత్తంగా ఉండి ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టిసాదించి మెరుగైన దిగుబడి సాధించాలని కోరారు ఈ కార్యక్రమంలో ఏవో వెంకటరమణ బాలరాజు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలు కురవాలని ముత్యాలమ్మకు పూజలు

**చర్ల, జూలై 21 (ప్రజాజ్యోతి):** చర్ల మండలంలోని రాళ్లగూడెం గ్రామంలో గ్రామదేవత శ్రీ ముత్యాలమ్మ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ గంగస్నానం, బోనాల మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయబద్ధంగా అమ్మవారికి పవిత్ర జలాలతో గంగస్నానం చేయించి భక్తితో బోనాలు సమర్పించారు. అనంతరం గ్రామస్థులంతా ముత్యాలమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలందరిపై అమ్మవారి కరుణాకటాక్షాలు ఉండాలని రైతులకు అనుకూలంగా భారీ వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థనలు చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నూప రమేష్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ, మండల ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో ఉండాలని వ్యవసాయం అభివృద్ధి చెందాలని అమ్మవారిని వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో మహిళలు, పెద్దలు, యువకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. "వర్షం కురిస్తేనే బ్రతుకు పంట పండితేనే సుఖం" అంటూ రైతులు అమ్మవారి ఆశీస్సులు కోరుకున్నారు. రాళ్లగూడెంలోని శ్రీ ముత్యాలమ్మ ఆలయం భక్తులతో ఆధ్యాత్మిక వాతావరణంలో పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.




## ఘనంగా విశ్వ కోయ గోండి భాషా దినోత్సవం



**చర్ల, జూలై 21:(ప్రజాజ్యోతి ):** విశ్వ కోయ–గోండి భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం చర్ల మండలంలో ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ జేఏసీ నాయకులు, సామాజిక కార్యకర్తలు, భాషాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కోయ–గోండి భాష ప్రాముఖ్యతను చాటిచెప్పారు.ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ కోయ–గోండి భాషలు ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్ర, ఆత్మగౌరవానికి ప్రతీకలని అన్నారు . మాతృభాషను కాపాడుకోవడం ప్రతి ఆదివాసి బాధ్యత అని, భావితరాలకు కోయ–గోండి భాషను అందించేందుకు ప్రతి కుటుంబం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం కోయ–గోండి భాషల పరిరక్షణ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు పాఠశాలల్లో మాతృభాషలో బోధనకు ప్రాధాన్యత కల్పించాలని ఆదివాసీ భాషలకు తగిన గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో చర్ల మండల ఆదివాసీ జేఏసీ చైర్మన్ వాసం ముసలయ్య, నూగూరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరప శ్రీనివాస్, ఇరప రాజు దొర, పూనెం వరప్రసాద్, ఆదివాసీ మహిళా జేఏసీ నాయకులు ఇరప ప్రకాష్ దొర, ఇరప అపర్ణ, బీరబోయిన రాణి, కోరం బిక్షపతి, తాటి వెంకటరావు, బీరబోయిన శేఖర్, కలం శ్రీను, సరేం హరిదీప్, మడప అనిల్ తదితర ఆదివాసీ జేఏసీ నాయకులు, యువజన ప్రతినిధులు, మహిళా నాయకులు, కోయ–గోండి భాషాభిమానులు, ఆదివాసీ ప్రజలు పాల్గొన్నారు.

## ఇంటింటా తడి-పొడి చెత్త సేకరణకు శ్రీకారం

- పరిశుభ్రతలో ప్రతి ఇంటి భాగస్వామ్యం అవసరం
- గ్రామస్థులకు సర్పంచ్ రమాదేవి రాంబాబు పిలుపు



**దమ్మపేట,జూలై 21,(ప్రజాజ్యోతి ):** స్వచ్ఛ గ్రామ పంచాయతీ లక్ష్యంగా దమ్మపేట గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే కార్యక్రమానికి మంగళవారం శ్రీకారం చుట్టారు. గ్రామ ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు తడి, పొడి చెత్తను విడివిడిగా నిల్వ చేసేందుకు ప్రత్యేక చెత్త బుట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ పగడాల రమాదేవి–రాంబాబు, ఉపసర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు మాట్లాడు తూ గ్రామ పారిశుధ్య పరిరక్షణలో ప్రతి కుటుంబం భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిలోనే తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి గ్రామపంచాయతీ ట్రాక్టర్ వచ్చినప్పుడు సిబ్బందికి అందజేస్తే గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణం నెలకొంటుందని తెలిపారు. తడి చెత్తతో సేంద్రియ ఎరువులు తయారు చేయవచ్చని, పొడి చెత్తను రీసైక్లింగ్‌కు పంపించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడవచ్చని వివరించారు.గ్రామపంచాయతీ కార్యదర్శి బండి అనంత్ కుమార్ సువర్ణ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న పారిశుధ్య కార్యక్రమాలను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. ప్రతి ఇంటిలో తడి, పొడి చెత్తను విడివిడిగా నిల్వ చేయడం అలవాటు చేసుకోవాలని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్‌గౌడ్, దారా రాము, చాట్ల శ్రీ ను, రూపా రాంబాబు, బత్తుల సాయి, పసుమర్తి కుసుమాంబ, పూనెం పోలమ్మ, చిన్నశెట్టి నాగలక్ష్మి , ముక్తేశ్వరరావు, దేవయ్యతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక తరలింపు.....ట్రాక్టర్ సీజ్

**ములకలపల్లి,జులై 21 ప్రజాజ్యోతి:** మండలంలోని రామచంద్రాపురంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సోమవారం సీజ్ చేశారు. పాములేరు వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను ట్రాక్టర్‌లో తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వాహనాన్ని పట్టుకున్నారు. అనంతరం ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని ఎస్సై మధు ప్రసాద్ తెలిపారు.

## బూర్గంపహాడ్ గ్రంథాలయానికి మూత్ర శాలల సౌకర్యం కల్పించాలి



**బూర్గంపహాడ్,జూలై21(ప్రజా జ్యోతి ):** మండల కేంద్రంలోని ప్రభుత్వ గ్రంథాలయానికి మూత్రశాలలతో పాటు మౌలిక వసతులు కల్పించాలని తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి డి. పున్నం చంద్ డిమాండ్ చేశారు.మంగళవారం గ్రంథాలయాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ.. బూర్గంపహాడ్ గ్రంథాలయానికి దాదాపు 50 ఏళ్ల చరిత్ర ఉందని, ప్రతిరోజూ 100 నుంచి 200 మంది వరకు విద్యార్థులు, నిరుద్యోగులు, పాఠకులు గ్రంథాలయాన్ని వినియోగిస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం విచారకరమన్నారు.కాలానికి అనుగుణంగా గ్రంథాలయాన్ని ఆధునీకీకరించి డిజిటలైజేషన్ చేపట్టాలని, పోటీ పరీక్షలకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచాలని కోరారు. ముఖ్యంగా మహిళలు, విద్యార్థులు ఇబ్బందులు పడకుండా అత్యవసరంగా మూత్రశాలల సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.గ్రంథాలయ అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన వసతులు కల్పించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పుట్టి సమ్మశృతి, బర్ల సంధ్య, బర్ల రమ్య, గొల్ల సాయి ప్రణీత్, కైపు రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అన్నదైవం ప్రాజెక్టుకు సీతారామ జలాలు అందించాలని మంత్రి తుమ్మలకు రైతుల వినతి

**అన్నపురెడ్డిపల్లి, జూలై 21 (ప్రజా జ్యోతి ):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని అన్నదైవం ప్రాజెక్టు ఆయకట్టు రైతులు మంగళవారం ములకలపల్లిలో నిర్వహించిన పామ్ ఆయిల్ రైతుల ఆత్మసమ్మేళన కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు.అన్నదైవం ప్రాజెక్టు ఆయకట్టు కింద సుమారు 1,200 ఎకరాల్లో సాగు జరుగుతోందని, నాలుగు గ్రామాల రైతుల జీవనాధారంగా ఈ ప్రాజెక్టు నిలుస్తోందని రైతులు మంత్రికి వివరించారు. తగినంత నీటి లభ్యత లేక పంటలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా అన్నదైవం ప్రాజెక్టు చెరువును నింపి సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వినతిపత్రంలో కోరారు.రైతుల వినతిపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సానుకూలంగా స్పందించి, సంబంధిత శాఖ అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ వనమా గాంధీ, ఉప సర్పంచ్ మారగాని అశోక్ ,రైతు నాయకులు సుగ్గల నరసింహారావు, చల్లా రమేష్, పానుగంటి రాఘవులు, వెంకటేశ్వర్లు, సత్యం, ఉమర్, తదితరులు పాల్గొన్నారు.



## సీతారామ ప్రాజెక్టు నిర్వాసితుల సమావేశం

- గ్రామసభల ఆమోదంతోనే ప్రాజెక్టు పనులు చేపట్టాలని డిమాండ్





**దమ్మపేట,జూలై 21,(ప్రజా జ్యోతి ):** సీతారామ ప్రాజెక్టు ప్రభావిత దమ్మపేట మండలంలోని ఆరు గ్రామపంచాయతీల నిర్వాసితుల సమావేశం మంగళవారం పట్వారిగూడెం కళ్యాణ మండపంలో జరిగింది. సమావేశంలో ఆదివాసీ గిరిజన నాయకుడు కారం శ్రీరాములు మాట్లాడుతూ, నిర్వాసితుల ఆమోదం లేకుండా ప్రాజెక్టు పనులు చేపట్టవద్దని, పీసా చట్టం ప్రకారం గ్రామసభల నిర్ణయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. 2019లో సీతారామ ప్రాజెక్టు ప్రారంభమైనప్పటి నుంచి గిరిజనుల భూముల రికార్డులు మార్చుకున్నప్పటికీ, ఇప్పటివరకు నష్టపరిహారం అందలేదని, ఏడు సంవత్సరాలు గడిచినా నిర్వాసితులకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర ప్రాంతాల్లో ఎకరానికి రూ.12 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు పరిహారం చెల్లించిన ప్రభుత్వం, దమ్మపేట మండలంలో ప్రకటించిన రూ.8 లక్షలు కూడా ఇవ్వలేదని పేర్కొంటూ, ప్రస్తుత భూముల మార్కెట్ విలువ ప్రకారం ఎకరానికి రూ.40 లక్షల పరిహారం, ప్రతి ఆయిల్‌పామ్ చెట్టుకు రూ.1.50 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు.అలాగే అంకంపాలెం, పట్వారిగూడెం, బాలరాజుగూడెం, పెద్దగొల్లగూడెం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించకుండానే పీసా కమిటీ సమావేశాలు నిర్వహించినట్లు చూపించి కొద్దిమంది సంతకాలతో ప్రక్రియ పూర్తి చేశారని సీతారామ ప్రాజెక్టు అధికారులపై ఆరోపించారు. ప్రధాన కాలువ నిర్మాణానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే రైతుల అభిప్రాయం తీసుకోకుండా డిస్ట్రిబ్యూటరీ (పంట) కాలువలను నిర్మించడం సరికాదన్నారు. వరి సాగు జరిగే ప్రాంతాలు, చెరువులకు నీరు అందించే అవసరం ఉన్న చోట్ల మాత్రమే గ్రామ సభ తీర్మానం మేరకు పంట కాలువలు నిర్మించాలని, ఆయిల్‌పామ్ తోటలకు డ్రిప్, బోర్ల ద్వారానే నీటి సరఫరా జరుగుతుండటంతో సాగునీటి కాలువలు అవసరం లేదని వివరించారు.సమావేశంలో ఆమోదించిన పీసా కమిటీ తీర్మానాలను జిల్లా కలెక్టర్, సంబంధిత మంత్రులు, ఐటీడీఏ పీఓకు అందజేసి నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోరనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కూరం వెంకటేశ్వరావు. కూరం అర్జున్ రావు. మోకాళ్ళ గురుమూర్తి,కోండ్రు ప్రసాద్,కొరస సాగర్, కొమరం సుశీల, కురసం శ్రీను, మడకం గంగరాజు, చెలికాని సూరిబాబు, బోల్లికొండ నాగేశ్వరావు, చెలికాని ప్రసాద్, కల్లూరి రాజేష్. వంకా ముత్యాలరావు, కాకా శివశంకర్, కుంజ చినబాబు, కాకా వెంకటేశ్వరావు, మొగిలి కృష్ణ, కూరం వెంకటేశ్వరరావు, కూరం అర్జున్‌రావు పాటు పెద్ద సంఖ్యలో నిర్వాసితులు, మహిళా రైతులు పాల్గొన్నారు.



# ఆరోగ్య చదువు తెలంగాణలో కొలువు

● వైద్యో నారాయణ...! ● ప్రభుత్వానికే మస్కా..! ● ఫేక్ సర్టిఫికెట్లతో ప్రభుత్వ వైద్య ఉద్యోగం సాధించాడా..? ● 1 నుంచి 10వ తరగతి వరకు నకిలీ విద్యా ధృవపత్రాలు సృష్టించి ఉద్యోగం పొందినట్లు ఆరోపణలు ● లోకల్ నిబంధనలను అడ్డంగా పెట్టుకుని ప్రభుత్వాన్ని మోసం చేశారనే విమర్శలు ● ప్రభుత్వ వైద్యుడిగా విధులు నిర్వహిస్తూనే ప్రైవేట్ ఆసుపత్రి నిర్వహణపై ఆరోపణలు ● నకిలీ ధృవపత్రాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు..? ● టీవీవీపీలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన ఫేక్ సర్టిఫికెట్ల వ్యవహారం ● జిల్లా అధికారులు సమగ్ర విచారణ చేపడితే బహిర్గతం కానున్న నిజాలు

**సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగం సాదించాలంటే ఎంతో కష్టంతో కూడుకున్న పని. అంతేకాకుండా ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎంతో శ్రమ, పట్టుదల ఉంటే సాధ్యమవుతుంది. ఇదే కోవలో క్రింద స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాడంటే కూడా కష్టమే. కానీ ఇల్లందులోని తెలంగాణ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ (టివిపిపి) లో వైద్యుడిగా పనిచేస్తున్న ఓ వైద్యుడు ప్రభుత్వాన్ని బురిడీ కొట్టించి దర్జాగా ప్రభుత్వ వైద్యశాలలో ఓ ఉన్నతమైన హోదాలో కొనసాగుతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది.**

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యం కల్పించే నిబంధనలను అడ్డంగా పెట్టుకుని ఓ వైద్యుడు నకిలీ విద్యా దృవపత్రాల ద్వారా ప్రభుత్వ ఉద్యోగం పొందినట్లు వస్తున్న ఆరోపణలు ప్రస్తుతం తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో విద్యాభ్యాసం పూర్తిచేసినప్పటికీ తెలంగాణలో చదివినట్లుగా ఒకటో తరగతి నుంచి పదవ తరగతి వరకు నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి ప్రభుత్వ ఉద్యోగం సాధించాడనే ప్రచారం టీవీవీపీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

### లోకల్ నిబంధనలకే తూట్లు..?

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానిక అభ్యర్థులకు అవకాశం కల్పించేందుకు అమల్లో ఉన్న లోకల్ విధానాన్ని దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికతను నిరూపించే విద్యా దృవపత్రాలే కీలక ఆధారాలు కావడంతో వాటిని ఫోర్జరీ చేసి సమర్పించినట్లు ప్రచారం జరుగుతుంది. దీంతో అర్హత ఉన్న స్థానిక అభ్యర్థులకు అన్యాయం జరిగిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### 1 నుంచి 10 వరకు ఫేక్ సర్టిఫికెట్లా...?

ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు తెలంగాణలో చదివినట్లు చూపించేలా నకిలీ దృవపత్రాలు సిద్ధం చేసి సంబంధిత నియామక ప్రక్రియలో సమర్పించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ దృవపత్రాల ఆధారంగా స్థానిక కోటాలో ప్రభుత్వ ఉద్యోగం పొందినట్లు ఉద్యోగ వర్గాల్లో చర్చ కొనసాగుతుంది. ఈ వ్యవహారంపై అధికారికంగా విచారణ జరపాలనే డిమాండ్ లు రోజు రోజుకు పెరుగుతున్నాయి.

### ప్రభుత్వ ఉద్యోగం... ప్రైవేట్ ఆసుపత్రి కూడా..?

ఇల్లందు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుడిగా విధులు నిర్వహిస్తూనే సదరు వైద్యుడు ఓ ప్రైవేట్ ఆసుపత్రిని కూడా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ సేవా నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ వైద్య సేవలు అందిస్తున్నారా అనే అంశాన్ని కూడా విచారణలో చేర్చాలని పలువురు కోరుతున్నారు.

### ఉన్నతాధికారులకు తెలిసినా చర్యలు లేవా..?

ఇల్లందు ప్రభుత్వ వైద్యశాలలో వైద్యుడిగా ఉన్నత స్థాయిలో ఉంటూ అటు ప్రభుత్వం... ఇటు తెలంగాణ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ (టివివిపి) లో ఈ వ్యవహారంపై తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ ఇప్పటివరకు సంబంధిత శాఖల నుంచి ఎలాంటి స్పష్టమైన స్పందన లేకపోవడం అనుమానాలకు తావిస్తుంది. ఉన్నతాధికారుల దృష్టికి విషయం వెళ్లినా చర్యలు తీసుకోలేదా? లేక వారి అండదండలతోనే వ్యవహారం కొనసాగిందా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

### టీవీవీపీలో హాట్ టాపిక్

ప్రభుత్వ వైద్యుడిగా లోకల్ అభ్యర్థి పేరుతో ఫేక్ సర్టిఫికెట్ల వ్యవహారం ప్రస్తుతం టీవీవీపీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఉద్యోగులు, వైద్య వర్గాలు ఈ అంశంపై విస్తృతంగా చర్చించుకుంటుండగా, పూర్తి స్థాయి విచారణ జరిగితే మరికొన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### కలెక్టర్ విచారణతో బయటపడే నిజాలు..?

ఫేక్ సర్టిఫికెట్ల వ్యవహారంపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక విచారణకు ఆదేశించి విద్యా దృవపత్రాల అసలుదనం, స్థానికత దృవీకరణ, నియామక ప్రక్రియ, ప్రైవేట్ ప్రాక్టీస్ వంటి అంశాలపై సమగ్ర దర్యాప్తు చేపడితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని ప్రజలు కోరుతున్నారు. ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత వ్యక్తులతో పాటు నకిలీ దృవపత్రాల తయారీకి సహకరించిన వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ వ్యక్తమవుతుంది.

### జిల్లా అధికారుల తీరుపై పలు అనుమానాలు

ఇల్లందు ప్రభుత్వ వైద్యశాలలో ఫేక్ సర్టిఫికెట్లతో వైద్యుడిగా కొనసాగుతున్న వ్యవహారం అసలు ఆ శాఖ జిల్లా అధికారులకు తెలిసే జరిగిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ వైద్యుడికి... జిల్లా స్థాయిలో ఉన్న ఉన్న ఆ శాఖ అధికారికి మధ్య ఏమైనా లోపాయికారి ఒప్పందం ఉందా అనే విమర్శలు వెల్లివెల్లువెత్తుతున్నాయి. అసలు ఆ వైద్యుడు తెలంగాణ రాష్ట్రం లోనే విద్యనభ్యసించకుండా ఆంధ్రాలో చదువు పూర్తి చేసినప్పటికీ ఫేక్ సర్టిఫికెట్లు సృష్టించి ప్రభుత్వ వైద్య ఉద్యోగం చేసిన విషయంపై ఉన్నతాధికారులు ఎలా విచారణ చేసి ఎలాంటి చర్యలు తీసుకుంటారోనన్న ఉత్కంఠ నెలకొంది.